



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

మరో రెండు ఖరారు

- ఇద్దరు అభ్యర్థులను ప్రకటించిన టిడిపి
- కదిరికి కందికుంట వెంకట ప్రసాద్ భార్య యశోదాదేవి
- పుట్టపర్తికి 'పల్లె' కోడలు పల్లె సింధూర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను గురువారం నాడు విడుదల చేసింది. ఈ జాబితాలో సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల అభ్యర్థులను ఆ పార్టీ ఖరారు చేసింది. ఈ జాబితాలో స్వల్ప మార్పులు కన్పించాయి. కదిరి సీటు కందికుంట వెంకట ప్రసాద్‌కు అని భావిస్తుండగా ఆయన భార్య కందికుంట యశోదాదేవికి ఇచ్చారు. అదే విధంగా పుట్టపర్తి సీటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కాకుండా ఆయన కోడలు పల్లె సింధూరకు ఇచ్చారు. రెండో జాబితాలో ప్రకటించిన రెండు పేర్లు కూడా మహిళలకే ఇవ్వడం గమనార్హం. దీంతో టిడిపి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 11 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్టయింది. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ధర్మవరం బిజెపికి పొత్తుల్లో భాగంగా ఇచ్చారు. అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ పోటీలో ఉండనున్నారు. ఈ మేరకు ఆయన ప్రచారాన్ని గురువారం నుంచి ప్రారంభించారు. ఇవి పోను రెండు అసెంబ్లీ స్థానాలు పెండింగులోనున్నాయి. అనంతపురం, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలు మినహా తక్కిన అసెంబ్లీ నియోజకవర్గాలన్నీ టిడిపి అభ్యర్థులను ప్రకటించినట్టు అయ్యింది. పెండింగ్‌లో ఉన్న రెండింటిలోనూ అనంతపురం అర్బన్ నియోజకవర్గం పొత్తుల్లో జనసేనకు అని ప్రచారం జరిగినా ఆ అవకాశం లేదన్న చర్చ నడుస్తోంది. టిడిపినే ఈ స్థానం నుంచి కూడా పోటీ చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇక గుంతకల్లుకు వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అభ్యర్థుల పేర్లు ప్రకటించని రెండు చోట్లా గ్రూపులున్నాయి. మాజీ ఎమ్మెల్యేలు అనంతపురానికి ప్రభాకర్ చౌదరి, గుంతకల్లు జితేందర్ గౌడ్‌లు మరోమారు తమకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో మార్పులు చేపడితే ఏ రకంగా సర్దుబాటు చేస్తారన్నది చూడాల్సి ఉంది. ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారధికి స్థానం సర్దుబాటు చేయాల్సి ఉంది. పెనుకొండ టిక్కెట్టు సవితకు కేటాయించాక ఈయనకు ఎక్కడ నుంచి పోటీ చేయించే అవకాశం కల్పిస్తారన్న చర్చ నడుస్తోంది. అదే విధంగా పొత్తులో ధర్మవరం బిజెపికి వెళ్లాక అక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ పరిస్థితి ఏమిటన్నది కూడా చర్చ నడుస్తోంది. టిక్కెట్టు దక్కకుండా మిగిలిన వారిలో కళ్యాణదుర్గం నుంచి హనుమంతరాయ చౌదరి కుటుంబం ఉంది. వీరందరికీ ప్రత్యామ్నాయం ఏమి చూపనున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టిడిపి ఇప్పటి వరకు రెండు పార్లమెంటు స్థానాలకూ అభ్యర్థులను ఖరారు చేయలేదు. హిందూపురం పార్లమెంటు బిజెపికి పొత్తుల్లో ఇవ్వనున్నట్టు ప్రచారం జరిగినప్పటికీ ఆ పార్టీ అధిష్టానంతో జరిగిన చర్చల్లో ఈ అంశం ముందుకు రానట్టు తెలుస్తోంది. దీంతో రెండు పార్లమెంటు స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులను బరిలో దింపాల్సి ఉంటుంది. ఈ స్థానాల్లో పాత వారినే ప్రకటిస్తుందా... లేక కొత్త మార్పులతో కొత్త వారికి అవకాశం కల్పిస్తుందా..? అన్నది చూడాల్సి ఉంది. మూడో జాబితా సమయానికి మిగిలిన రెండు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా అభ్యర్థుల ఖరారు తరువాత వస్తున్న అసంతృప్తులను టిడిపి ఏ రకంగా చల్లార్చి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమయత్తం చేస్తుందన్నది చూడాల్సి ఉంది.



కందికుంట యశోదా దేవి
కదిరి నియోజకవర్గం



పల్లె సింధూర
పుట్టపర్తి నియోజకవర్గం

'ఈబీసీ నేస్తం' సాయం రూ.26.93 కోట్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈబీసీ నేస్తం పథకం ద్వారా మూడవ విడత జిల్లాలో 17,953 మంది లబ్ధిదారులకు రూ.26.93 కోట్లు మంజూరు అయిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. గురువారం నాడు శ్రీ సత్యసాయి కలెక్టరేట్లో జిల్లా స్థాయి ఈబీసీ నేస్తం సాయం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ క్షత్రియ, వెలమలతోపాటు ఇతర ఓసి వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ప్రభుత్వం ఏటా రూ.15వేల సాయాన్ని అందిస్తోందన్నారు. అందులో భాగంగా మూడో ఏడాది పంపిణీ చేసిందన్నారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఆహుడ వైస్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్



విలేకరులతో మాట్లాడుతున్న డిఇఒ మీనాక్షి

శ్రీ సత్యసాయి జిల్లాలో ఈనెల 18 నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేసినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. గురువారం నాడు కొత్తచెరువులోని డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. జిల్లాలో 439 పాఠశాలల పరిధిలో 27,555 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాల్లో బాలురు 11,484, బాలికలు 10,518, మొత్తం 22,002 మంది ఉన్నారు. ఇక ప్రయివేటు విద్యాసంస్థల్లో బాలురు 3,536, బాలికలు 2,017, మొత్తం 5553 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలకు సంబంధించి జిల్లాలో రెండు డివిజన్లుగా ఏర్పాటు చేసి 115 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పదవ తరగతి పరీక్షకు ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్లు 115 మది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ 115, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ 14, ఇన్విజిలేటర్స్ 1250 మందిని నియమించామన్నారు. 60 సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్, 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను ముందుగానే మూసివేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఒకరిద్దరు విద్యార్థులను 15 నిమిషాలు ఆలస్యం అయినా కేంద్రంలోకి అనుమతించ వచ్చునని తెలియజేశారు.

నేడు డాక్టర్ సాయి కాళేశ్వర్ వర్ధంతి



పెనుకొండ : షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, డాక్టర్ సాయి కాళేశ్వర్ 12వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శివసాయి మందిరం వద్ద ఉన్న కాళేశ్వర్ సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. కాళేశ్వర్ సమాధి వద్ద శుక్రవారం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సాయి కాళేశ్వర్ షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్‌ను స్థాపించి, తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రిని నెలకొల్పి ప్రతిరోజూ పేదలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయిస్తున్నారు. వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప సూచించారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండలంలోని తుంగోడు పంచాయతీ కార్యదర్శి సావిత్రికి జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపిన వివరాలు.. 2021-22, 2022-23 ఆర్థిక సంవ త్సరాలకు సంబంధించిన గ్రామపంచాయతీ రికార్డులను అప్‌డేట్ చేసి తనిఖీ నిమిత్తం తమకు అందజేయాలని ఉన్నతా ధికారులు ఆదేశాలిచ్చినా ఇప్పటివరకూ సంజాయిషీ గాని, రికార్డులు గాని సమర్పించలేదని డిపిఒ జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. తమ కార్యాలయం నుంచి రెండో నోటీసును మరోసారి బుధవా రం ఆమెకు జారీ చేశామని నాలుగు రోజుల్లోపు పూర్తిస్థాయిలో రికార్డులు సిద్ధం చేసి తమ కార్యాల యంలో అందజేయాలని లేనిచో లభ్యమైన రికార్డుల మేరకు కార్యదర్శిపై శాఖా పరమైనచర్యలు తీసు కుంటామని డిపిఒ జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో తెలిపారు.

6 దుకాణాలపై కేసులు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలోని పలు దుకాణాలపై తూనికలు, కొలతలు శాఖ అధికారులు కొరఢా ఝుళిపించారు. ప్రతి సంవత్సరం తరహాలో తూనికలకు ముద్రలు వేయడం కోసం రొద్దంలో రెండు రోజుల పాటు ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా వంద మందికి పైగా దుకాణాల యజమానులు తూనీకల ముద్రలు వేయించారు. గురువారం కొందరు దుకాణాల్లో అధిక ధరలకు సరుకులు విక్రయిస్తున్నట్లు, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో ఆయా దుకాణాలకు వెళ్లి కొన్నిటిని కొనుగోలు చేశారు. బియ్యం తూకంలో తక్కువగా ఇవ్వడం, కూల్ డ్రింకులు, వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మడంతో 6 దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు హిందూపురం లీగల్ మెట్రా లజీ అధికారి శివశంకర్ తెలిపారు. వీరికి అపరాధ రుసుము వేసి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికీ తూనీకలకు ముద్రలు వేయించుకోని వారిపై ఎప్పుడైనా తనిఖీలు చేపడతామని హెచ్చరించారు.

గీతాంజలిపై విమర్శలు నీచం :మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాధిత గీతాంజలి కుటుంబంపై విమర్శలు చేయడం నీచ రాజకీయాలకు నిదర్శనం అని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి గురువారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను మనస్ఫూర్తిగా తెలిపిన ఆమెపై పచ్చ పత్రికలు, ఐటీడీపీ, టీడీపీ సోషల్ మీడియా దాడికి తెగబడ్డాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ ట్రోలింగ్ చేసి ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారన్నారు. బాధిత కుటుంబానికి సిఎం జగన్ రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని, భవిష్యత్తులో వైసిపి ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఆమెతో పాటు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించండి

సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సభ రఘువీరా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించామ న్నారు. ప్రస్తుతం మోటార్లు, పైపుల మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువత కోసం పరిశ్రమ లు ఏర్పాటు చేసి వలసలను నివారించామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని వధంగా అగ్రికల్చర్, హార్టి కల్చర్, వెటర్నరీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గా సుధాకర్‌ను గెలిపిస్తే 320 చెరువులను నింపుతామని, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా మని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్, కన్వీనర్లు బాబు, మంజునాథ్, గౌడప్ప, లోకేష్, గురుమూర్తి, మందలపల్లి నాగరాజు, నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధులు సభలో పాల్గొన్న రఘువీరారెడ్డి, నాయకులు

పార్టీ కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని ఆదిరెడ్డిపాలెంలో కొత్తగా నిర్మించిన భవనంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి హాజరయ్యారు. సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బాబు, మండల కన్వీనర్లు మంజునాథ్, మందలపల్లి నాగరాజు, గురుమూర్తి, గౌడప్ప, లోకేష్ పాల్గొన్నారు.

టిడిపితోనే పెనుకొండ అభివృద్ధి

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పట్టణాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె గురువారం నగర పంచాయతీ పరిధిలోని మారుతినగర్, బిటిఆర్ కాలనీ, శ్రీరాములయ్య కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా కాలనీ వాసులు డ్రెయినేజీ, తదితర సమస్యలను విన్నవించారు. సవితమ్మ మాట్లాడుతూ రెండు నెలల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే వార్డుల్లోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సైకిల్ గుర్తుకి ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రచారంలో పాల్గొన్న సవితమ్మ, టిడిపి శ్రేణులు



విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

లేపాక్షి : మండలంలోని పులమతి ఉన్నత పాఠశాలలో గురువారం ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రాజగోపాల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఎంఇఒలు నాగ రాజు, కుళ్లాయప్ప మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే మంచి విజయాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో పిడి రామాంజనేయులు, ఉపాధ్యాయులు గిరి, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో వైఎస్ఆర్ సుజల పథకంతో భాగంగా నూతనంగా ఏర్పాటు శుద్ధ జల కేంద్రాన్ని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ ప్లాంట్ సాంకేతికంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు జయప్ప, గిరి నాయకులు వేమయ్య, అమీర్, నరసింహమూర్తి, సోము, రామకృష్ణ, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు

లేపాక్షి : మండలంలోని లేపాక్షి, కంచిసముద్రం సెక్టార్లలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ వాసుదేవగుప్తా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. సీడీపీఓ రెడ్డి రమణమ్మ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉంటే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా పుడతారన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, జయమ్మ, అంగన్వాడీ సిబ్బంది ధనమ్మ, సుధక్క, రత్నమ్మ, భాగ్యమ్మ, మహిళలు పాల్గొన్నారు.



అన్నప్రాస కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ సిబ్బంది

ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

హిందూపురం : దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వుల మేరకు పట్టణంలోని నానప్పనగర్‌లో వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయ పాలకమండలి కమిటీని ఎన్నుకున్నారు. పాలక మండలి గురువారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసింది.కమిటీ ఛైర్మన్ గా సి కె నాగేశ్వరరావు, సభ్యులుగా ఎన్.నాగేంద్ర కుమార్, ఎస్ ఎన్ శ్రీనివాసమూర్తి, ఏఎన్ శోభారాణి, పి లక్ష్మీ సరస్వతి, వి సరస్వతి చేత అనంతపురం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నరసింహ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జనంలోకి మడకశిర టిడిపి అభ్యర్థి

ప్రజాశక్తి-మడకశిర



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్

నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. పార్టీ అధిష్టానం ముందస్తుగానే అభ్యర్థిని ప్రకటించడంతో సునీల్‌కుమార్ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న సుపరిచితుడు కావడం, ఆయన కుమారుడైన సునీల్‌కుమార్ ప్రతి ఒక్కరినీ కలుస్తూ ఆప్యాయతగా పలకరిస్తూ ప్రజలను ఆకట్టుకుంటు న్నారు. గతంలో ఈరన్న ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, తనకూ ప్రజలు ఓ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఐదు మండలాల్లో తనకు ఉన్న పరిచయాలతో అందరినీ కలిసి మద్దతు కోరారు. ఆయన వెంట వీఎం పాండురంగప్ప, రవిభూషణ్, అశ్వర్థామప్ప, ఆదినారాయణ, రామాంజనేయులు, ఉగ్రనరసింహప్ప, హనుమంత రాయప్ప, జయ రామప్ప, నారాయణప్ప, రామన్న, రవికుమార్, టీడీపల్లి మంజునాథ్, రమేష్, నరేష్ నడుస్తున్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని చోళసముద్రం, సిరివరం, కంచి సముద్రం జడ్పీ హైస్కూళ్లలో గురువారం పదో తరగతి విద్యార్థులకు గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ నాగేంద్ర సహకారంతో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత విద్యావంతులై దేశాభివద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, బాబుప్రసాద్, గోవిందరెడ్డి, గోపాల్, రవిశంకర్, అమర్, దేవేంద్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపుపై హర్షం

పెనుకొండ : ఎపి వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం పట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, పివి.రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

లేపాక్షి : మండలంలోని కంచి సముద్రం రహదారిలో సర్వే నెంబర్ 358/361 నెంబర్లోని ప్రభుత్వ భూమిలో గురువారం సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ జెండాలు నాటారు. ఇల్లు లేని నిరుపేదలతో కలిసి సిపిఐ కార్యదర్శి శివప్ప అధ్యక్షతన గుడిసెల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిరుపేదల కోసం ఎన్నో ఏళ్లుగా తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కరించలేదని, ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి పేదలు ఏర్పాటు చేసుకున్న స్థలాల్లో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, గోవిందప్ప, గౌతంకుమార్, గంగన్న, మద్దిలేటప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'బిసిలు ఏకమై జగన్‌కు బుద్ధి చెబుతాం'

ప్రజాశక్తి-మడకశిర

బిసిలంతా ఏకమై సిఎం జగన్‌కు బుద్ధి చెబుతామని బిసి నాయకులు హెచ్చరించారు. రొళ్లలో గురువారం కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జయరామిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ నారా యణప్ప, రామన్న, సన్నమారేగౌడ్, మంజునాథ్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిసిలను నిలువునా ముంచిన సిఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. టిడిపి పాలనలో చంద్రబాబు బిసిల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టగా, జగన్ వాటని రద్దు చేసి బిసిల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని ధ్వజమెత్తారు. బిసిలంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సునీల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిసి నాయకులు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పలు అనారోగ్య కారణాలతో సొంత డబ్బులతో వైద్యం చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద 17 మంది బాధితులకు రూ.21.93 లక్షలు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను బాధితులకు అందజేశారు.

హిందూపురం : పట్టణంలో వివిధ వార్డులకు చెందిన బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక గురువారం వైసిపి స్థానిక కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం రూ.7.40లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఓబుళదేవర చెరువు : మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందనిఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ పేర్కొన్నారు. గురువారం పల్లవి మండల సమైక్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ అర్చన, ఎపిఎం రమణప్ప, మహిళా సంఘం నాయకురాళ్లు ఈశ్వరమ్మ, వెంకట లక్ష్మి, శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవిమ్మ, సీసీలు వేణుగోపాల్, రమణ, హేమ భూషణ్, శ్రీనివాసులు, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి

కదిరి టౌన్ : పది విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కదిరి రూరల్ పరిధిలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ అన్నారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పదో తరగతి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

కంటి జబ్బులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : కంటి జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సూచించారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా పదవ తేదీ నుండి 16వ తేదీ వరకు అంధత్వనివారణ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కంటి జబ్బులపై అంధత్వ నివారణసంస్థ మేనేజర్ డాక్టర్ అనురాధ, పుట్టపర్తి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోష్నా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎం లలిత కుమారి, సూపర్వైజర్లు అభిద్, రాజేశ్వరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని బస్సు షెల్టర్ పక్కన ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, మల్ల గుండ్ల భాస్కర్, వెంకటేశ్వర్ రెడ్డి, కుళ్లాయప్ప పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్‌గా కదిరప్ప

కదిరి టౌన్ : కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్‌గా కదిరిప్పను అధిష్టానం నియమించింది. ఈసందర్భంగా కదిరిప్ప మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు, గిడుగు రుద్రరాజుకు, మాజీ పిసిసి శైలజనాథ్‌కు, రాష్ట్ర ఇంచార్జి మాణిక్యరాం ఠాకూర్‌కు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఛైర్మన్ సాకే శంకర్‌కు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామంలో రూ. 2.89 కోట్లతో ఏర్పాటు చేసిన విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు లోవోల్టేజ్ సమస్య తీరినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

హిందూపురం: చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు అమరేష్ ఏడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి లోని జనసేన పార్టీ కార్యాలయంలో అమరేష్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును జనసేన పార్టీ సభ్యులు కొణిదెల నాగబాబు చేతుల మీదుగా అందించారు ఈ సందర్భంగా మృతుడి భార్య వెంకట రత్నమ్మ. మాట్లాడుతూ తమ బిడ్డల భవిష్యత్ కు తోడ్పాటు అందించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షులు వరుణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, హిందూపురం నియోజకవర్గం ఇంచార్జ్ ఆకుల ఉమేష్, చిన్న ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరి సుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

హిందూపురం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు విగ్రహాన్ని పట్టణంలోని సద్భావన్ సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఇనాయతుల్లా కోరారు. ఈ విషయంపై గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు రాజకీయ గురువుగా పేరున్న కల్లూరు సుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు రైల్వే రోడ్డుకు కల్లూరి సుబ్బారావు రోడ్డుగా నామకరణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

జిల్లావ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలు చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలకు చెందిన ప్రచార ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలోని ఏడికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పలు కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తుగా అడ్మిషన్లకు శ్రీకారం చుట్టారన్నారు. అదేవిధంగా ప్రధాన కూడలిలో సీబీఎస్సీ పేరుతో పర్మిషన్లు లేకపోయినా కూడా పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కార్పొరేట్ విద్యాసంస్థలు ఏమాత్రం పాటించకుండా వాళ్లకు ఇష్టం వచ్చినట్లు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని స్కూళ్లకు పర్మిషన్లు తెచ్చుకొని ఐదు నుంచి పది బ్రాంచ్ లు నడుపుతున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా నడుపుతున్న బ్రాంచిలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, నాగార్జున, బాబ్జాన్, వీరేష్, హర్ష కుమార్, భగత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సు బదిలీలను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్


రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలు చేపట్టడం ఎంత మాత్రం సమంజసం కాదని వాటిని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం పుట్టపర్తిలో మాట్లాడుతూ 2023 మే, జూన్‌లో ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు నిర్వహించినప్పటికీ, ప్రభుత్వం సిఫార్సు బదిలీలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల పోరాట ఫలితంగా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానానికి ప్రభుత్వమే తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి బదిలీలు చేయాలనే ఉద్దేశం ఉంటే ఈ అక్రమ బదిలీలను ఆపివేసి వేసవి సెలవులలో సాధారణ బదిలీలు చేసి చిత్త శుద్ధిని చాటుకోవాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, సహధ్యక్షులు జిహెచ్ బాబు, సీతామహాలక్ష్మి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్ వలీ, రమీజాబీ, హరికృష్ణ తదితరులు కోరారు.

చంద్రబాబువి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
వడ్డెరసంఘం నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ వడ్డెర్లకు తీరని అన్యాయం చేస్తున్నారని వడ్డెరసంఘం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వడ్డెరసంఘం నాయకులు, న్యాయవాది ఎస్ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ వడ్డెర్లను చట్ట సభలోకి పంపిస్తామని నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ హామీలు ఇస్తూనే మరోపక్క వడ్డెర్లకు ఎమ్మెల్యే ఎంపీ సీట్లు ప్రకటించాలని నిలదీసిన వడ్డెర నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తగవని అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న వడ్డెర్లను విస్మరించడం తగదన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలు మాని వడ్డెర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో గురువారం పట్టణంలోని 56 సమాఖ్య సభ్యులకు రూ.50వేలు చొప్పున మొత్తం రూ.28 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ కాచర్ల లక్ష్మిల చేతులమీదుగా మహిళలకు పంపిణీ చేశారు. పొదుపు సంఘాల సభ్యులకు మెప్మా సంస్థ రివాల్వింగ్ ఫండ్ కింద అందించే రుణాలను ఏదైనా వ్యాపార రంగాల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళలు సమిష్టిగా రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది వెంకటేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి పట్టం కట్టండి : మక్బూల్

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాబోయే ఎన్నికలలో వైసీపీకి పట్టం కట్టాలని వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త మాక్బుల్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కదిరి రూరల్ మండల పరిధిలోని పందలకుంట గ్రామపంచాయతీలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామ విద్యార్థులు బస్సు సౌకర్యం లేక పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలుపగా తక్షణమే స్పందించి కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడి బస్సు వచ్చేందుకు చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుల పూల శ్రీనివాస్ రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్ రెడ్డి, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, కదిరి మున్సిపల్ వైస్ ఛైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ ప్రకాష్, ఎంపిటిసి కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు కుర్లి శివారెడ్డిపాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మక్బూల్, తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్


ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పట్టణంలోని 6వ వార్డు వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కాచర్ల అంజి అన్నారు. ఈ మేరకు గురువారం 6వ వార్డు శివానగర్‌లో అర్హులైన లబ్దిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాచర్ల అంజి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డిని గెలిపించి లక్షన్లో మరొకసారి జగన్ మోహన్ రెడ్డిని సిఎంగా చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రతాప్ రెడ్డి, శిలా విజయ్ కుమార్ ,సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బుక్కపట్నం : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలో ఆపార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయరాం, నాయకులు దాసరి శ్రీనివాసులు, సంకుమహేష్, మన్సూర్, సాయికుమార్, రామాంజనేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అదేవిదంగా చిలకం మధుసూదన్రెడ్డి బార్య చిలకం ఛాయాదేవి చేతులమీదుగా కేక్ కట్ చేయించి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉద్యోగాలను అమ్ముకుంటున్న వైసీపీ : తెలుగుయువత

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

సంతలో పశువులను అమ్ముకున్నట్లు గ్రూప్ 1 ఉద్యోగాలను వైసిపి ప్రభుత్వం అమ్మకాలకు పెట్టిందని తెలుగు యువత నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు పట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ, 30 డిప్యూటీ కలెక్టర్లు, 25 డీఎస్పీ పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ మోసాలకు పాల్పడిన కార్యదర్శి పి ఎస్ ఆర్ ఆంజనేయులు, ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూపు 1 మెన్స్ లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆ నోటిఫికేషన్ ద్వారా నియామకమై ప్రస్తుతం వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్న 162 మంది నియామకాలు చల్లవని మళ్లీ గ్రూప్ 1 మెన్స్ పరీక్షలు నిర్వహించి 6 నెలల లోపు నియామక ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఏమాత్రం నైతిక విలువలు విశ్వనీయత ఉంటే తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆంబులెన్స్ రమేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షులు వైవి మురళి చౌదరి, బుల్లి సుధీర్, నల్లమాడ మండలం అధ్యక్షుడు శివప్రసాద్, బడ మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత

బత్తలపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారనిఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. గురువారం బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన బత్తలపల్లి గ్రామ సచివాలయం-2 నూతన భవనాన్ని వారు ప్రారంభించారు. వివిధ గదులను సర్పంచు అక్కిం కాశీం,ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఎంపీటీసీకోటి నరేష్ కుమార్, తహశీల్దార్ శివశంకర్ నాయక్, ఎంపీడీవో శివనాగప్రసాద్ ప్రారంభించారు.

సొంతింటి కల సాకారం : బత్తలపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని జగనన్న లేఅవుట్లో ని లబ్ధిదారులకు 320 మందికి ఇంటి స్థల శాశ్వత హక్కు పత్రాలను (రిజిస్ట్రేషన్) గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలం కన్వీనర్ జయరామిరెడ్డి, సచివాలయం కన్వీనర్ రాంభూపాల్, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

పరిగి : టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు మాజీ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తూ పార్టీ విధేయుడుగా మారిన లక్ష్మారెడ్డిని మండల కన్వీనర్ గా పార్టీ గుర్తించి పదవులు కట్టబెట్టినప్పటికీ ఇటీవలే వైసిపిలో మారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ గా పనిచేస్తూ సవితమ్మను ను వ్యతిరేకించిన లక్ష్మారెడ్డిని పార్టీ అధికార ప్రతినిధి ఎప్పుడో సస్పెండ్ చేయాల్సిందన్నారు. అయినప్పటికీ ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పించినప్పటికీ మండల కన్వీనర్ ఇతర పార్టీని ఆశ్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవింద్ రెడ్డి డిఎస్ఎల్ శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ చౌడప్ప, రవి, శాసనకోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హిందూపురం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ప్రభావతి అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం పట్టణంలోని దీప్తి, వేలాంగిణి మాత, వివేకానంద మిలీనియం, ఈశ్వర్, పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాలలను ఎంఇఒ గంగప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ విద్య గురించి అవగాహన కల్పించారు. ఎకో క్లబ్, యూత్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. పాంచజన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా, ప్రకృతిలోని అన్ని ప్రాణులను రక్షించుకోవటం అందరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు మొక్కల పెంపకాన్ని సాంప్రదాయంగా, ఉద్యమంగా కొనసాగించలన్నారు. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ, వాటి ప్రయోజనాలను ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొని రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, ఎన్జీసి కోఆర్డినేటర్ రామలింగయ్య, పాఠశాల హెచ్ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీశ్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు. దీప్తి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు అబ్రహం కుట్టీ అంకుల్, లూసీ, దీపూ, ఆయా పాఠశాలల్లో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో సిద్ధుకు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆబాద్ పేటలో నివాసం ఉంటున్న సీనియర్ జర్నలిస్టు సిద్ధు బుధవారం గుండె పోటుతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో గురవారం హిందూపురం ప్రెస్ క్లబ్‌లో సిద్దూ సంతాప సభను ఏర్పాటు చేశారు. సిద్దూ మృతికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

'కందికుంట'కే కదిరి టిడిపి టికెట్

ప్రజాశక్తి - కదిరి టౌన్


కందికుంట యశోదాదేవి
కదిరి నియోజకవర్గం

సంబరాల్లో టిడిపి నాయకులు

కదిరి టిడిపి అసెంబ్లీ అభ్యర్థిగా కందికుంట యశోదాదేవిని ఆపార్టీ అధిష్టానం ఖరారు చేసింది. టీడీపీ,జనసేన,బీజేపీ ఉమ్మడి కూటమి కదిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జికందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోద దేవిని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రెండవ జాబితాలో ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు నియోజవర్గం వ్యాప్తంగా సంబరాల్లో మునిగి తేలారు. గురువారం పట్టణంలోని కాలేజ్ , అంబేద్కర్, జీవి మాన్ సర్కిళ్లలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కందికుంట యశోద దేవి ఇప్పటికే మున్సిపాలిటీలో పలు వార్డుల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు.గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డు పరిధిలోని పలు కాలనీలలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన తర్వాత చేపట్టబోమే ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాలు వివరించారు. అధిష్టానం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ప్రకటించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో మొదటిసారిగా మహిళకు చోటు : కదిరి చరిత్రలో ఏనాడు లేని విధంగా మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మహిళకు అవకాశం కల్పించారు. తెలుగుదేశం, కాంగ్రెస్,వైసిపి లతోపాటు పలు పార్టీలు పురుష అభ్యర్థులకే సీట్లు కేటాయించారే తప్ప మహిళలకు కేటాయించిన దాఖలాలు లేవు. నియోజవర్గం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మహిళకు చోటు కల్పించడం పట్ల ఆ పార్టీ నాయకులతోపాటు ప్రజాసంఘాలు,మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కందికుంట యశోదాదేవి కందికుంట నారాయణమ్మ ట్రస్టును ఏర్పాటు చేసి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నియోజవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ తమదైన ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా గ్రామాలలో తాగునీటి ఎద్దడి నెలకొన్నప్పుడు ట్రస్టు ద్వారా సొంత నిధులతో బోరు బావులు తవ్వించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పేద పిల్లలకు అండగా నిలబడుతూ విద్య పరంగా సహాయ సహకారాలు అందించారు. పార్టీలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

విస్తృత ప్రచారం : 20 రోజులుగా మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కందికుంట యశోద దేవి విస్తృతంగా పర్యటించారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టి సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ గెలుపునకు కృషి చేయాలని అభ్యర్థించారు. నియోజవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన ధ్యేయంగా చెబుతున్నారు. టిడిపి అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించే విధంగా చొరవ తీసుకుంటామని హామీ ఇస్తున్నారు.

తలుపుల : కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మకు కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై మండలకేంద్రంలో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, ఓబుల్ రెడ్డి, జై చంద్ర, కొమ్మెర శీన బాబు, రజంతుల్లా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో 'గోనుగుంట్ల ' భారీ ర్యాలీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండలంలో గురువారం పర్యటించిన గోనుగుంట్ల సూర్యనారాయణకు టిడిపి, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా గజమాలతో ఆయనను సత్కరించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని చిల్లా వారిపల్లి శ్రీ కాటి కోటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని ఈసందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రఘురాం చౌదరి, మంజు నాథు , వంశీకృష్ణ కిషోర్, మండల నాయకులు కార్యకర్తలు, సూర్యనారాయణ అభిమానులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టిడిపి బరిలో పల్లె సింధూర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి టికెట్టు అనూహ్యంగా పల్లె సింధూర రెడ్డిని వరించింది. ఈ మేరకు ఆమె పేరును టిడిపి అధిష్టానం గురువారం ప్రకటించింది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తనకే టికెట్టు ఇవ్వాలని అధిష్టానం వద్ద చివరి వరకు ఒత్తిడి తెచ్చినప్పటికీ పల్లెకు కాదని ఆయన కోడలు సింధూర రెడ్డిని పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. పల్లె రఘునాథ్ రెడ్డికి టికెట్టు ఇవ్వరాదని పలువురు అసమ్మతి నాయకులు ప్రయత్నించారు. అలాగే బీసీలకు టికెట్ ఇవ్వాలని పలువురు బీసీ నాయకులు ప్రయత్నించినప్పటికీ, సామాజిక వర్గాల సమీకరణలో భాగంగా చివరికి రఘునాథరెడ్డిని కాదని ఆయన కోడలును అభ్యర్థిగా ప్రకటించారు. పల్లె రఘునాథ్ రెడ్డి కుమారుడు పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి భార్య పల్లె సింధూర రెడ్డి ఎంటెక్, నానో టెక్నాలజీ గోల్డ్ మెడలిస్ట్. ఈమె పుట్టింది అనంతపురం అయినా ఆమె తండ్రి శంకర్ రెడ్డి కేరళ రాష్ట్రం డీజీపీగా పోలీస్ శాఖలో పనిచేస్తున్నందున ఆమె విద్యాభ్యాసం అంతా కేరళలో సాగింది. పల్లె విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఆమెకు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. చిన్న వయసులోనే సింధూర రాజకీయ అరంగ్రేటం చేసినట్లు అవుతుంది. కాగా సింధూర టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, పల్లె అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

టిడిపి శ్రేణులు సంబరాలు : పల్లె సింధూర రెడ్డిని టిడిపి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గురువారం పట్టణంలో హనుమాన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పల్లెకు టికెట్టు రాకుండా ఎంత మంది ఎన్ని ప్రయత్నాలు చేసినా తిరిగి పల్లె కుటుంబానికే టికెట్ కేటాయించడం హర్షనీయమన్నారు. టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు గూడూరు ఓబులేసు, మహమ్మద్ రఫీ, దయ్యాల ఉమాపతి యాదవ్, కోనంకి గంగాధర్ నాయుడు, చెన్నకేశవ నాయుడు, పేపర్ గంగాద్రి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన పల్లె : తన కోడలును టిడిపి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబుకు, ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 27 ఏళ్లుగా తన కుటుంబాన్ని ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు రుణపడి ఉంటామన్నారు. ఈ ఎన్నికలలో కూడా తన కోడలు పల్లె సింధూర రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

కొత్తచెరువు : మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోడలు సింధూర రెడ్డిని పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడం పట్ల మండల టిడిపి నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పల్లె రఘునాథ్ రెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ గుర్తించి రఘునాథరెడ్డికోడలికి టికెట్ ను కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నాగేంద్రప్రసాద్, గాజుల చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, బోయరాజు, నాయుడు, సప్లయర్స్ రామ్మోహన్, పెద్దన్న, కేసప్ప, ఆర్ నాగేంద్ర, ఆలకుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఓబుళదేవర చెరువు : తెలుగుదేశం పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోడలు పల్లె సింధూర పేరు ప్రకటించ పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. మండల కేంద్రంతోపాటు కొండకమర్లలో గురువారం బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్ట ఓబుల్ రెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, ఇర్షాద్, షాను, ఆరీఫ్ ఖాన్, నిజాం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లె సింధూర రెడ్డిని అధిష్టానం ప్రకటించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.. వీరిలో కొంతమంది అనంతపురంలోని పల్లె సింధూర నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం మండల కన్వీనర్లు విజయ్ కుమార్, రామాంజనేయులు, తెలుగుదేశం నాయకులు, అంబులెన్స్ రమేష్, శ్రీరామ్‌నాయక్, శ్రీరామిరెడ్డి, కోట్లపల్లి తెలుగు యువత నాయకులు కంసల నారాయణస్వామి, రామయ్య, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, మాజీ సర్పంచులు పెద్దపయ్య ,రామ సుబ్బారెడ్డి,కత్తి వారి పల్లి ముస్తూరు బాబు, జయ ప్రకాష్, ముమ్మినేని శ్రీనివాసులు, తదితరులు సింధూర రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.